ప్రజాశక్తి

గురువారం 16 మార్చి 2023



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మొదటి రోజు 779 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నాడు ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 99 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 29,326 మంది విద్యార్థులకు గాను 28,547 మంది విద్యార్థులు హాజరయ్యారు. 779 మంది గైర్హాజరయ్యారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డిఇసి మెంబర్లు, హైపవర్ కమిటీ మెంబర్‌లు, జిల్లా అబ్జర్వర్ కలసి 58 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోకి నిమిషం ఆలస్యమైనా అనుమంతించం అనే నిబంధనతో విద్యార్థులు ఎనిమిది గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష' కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటిరోజు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐఒ సురేష్ బాబు తెలిపారు.



అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ప్రారంభం కానుంది. సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపులాగా కాకుండా ప్రాధాన్యతల ప్రకారం ఈ ఓట్ల లెక్కింపు ఉండటంతో సమయం ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంది. అయితే ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల సంఖ్య తక్కువగా ఉండటంతో గురువారం సాయంత్రంలోపు ఫలితాలొచ్చే అవకాశముంది. పట్టభద్రులకు సంబందించి శుక్రవారం వరకు వేచి ఉండే అవకాశముంది.

- ◆ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ◆ పట్టభద్రులకు మరుసటి రోజు వరకు కౌంటింగ్ కొనసాగే అవకాశం
- ◆ ఉపాధ్యాయ ఫలితాలు గురువారం వెలవడొచ్చు
- ◆ గెలుపుపై ఎవరి లెక్కలు వారివి

ఎమ్మెల్సీ ఓట్ల
లెక్కింపు నేడు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికలకు సంబంధించి అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో ఓట్ల లెక్కింపునకు పూర్తి స్థాయి ఏర్పాట్లు జరిగాయి. ఉపాధ్యాయ నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పట్టభద్రులకు 28 టేబుళ్ల ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సుదీర్ఘ సమయం పట్టే అవకాశం ఉండడంతో మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు జరిగే విధంగా 600 మంది సిబ్బందిని నియమించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 3,30,124 ఓట్లు ఉంటే 2,44,307 ఓట్లు పోలయ్యాయి. 49 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలోనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి 28,148 ఓట్లు ఉంటే 25,884 పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 12 మంది బరిలోనున్నాయి వీరి భవితవ్యం నేడు, రేపటిలోపు తేలనుంది.

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత

ఓట్ల లెక్కింపు జరుగుతున్న జెఎన్‌టియు కళాశాల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అటువైపు వెళ్లే రహదారులన్నింటిలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. లెక్కింపు కేంద్రంలోకి ఏజెంట్లు, అనుమతి ఉన్న వారిని మాత్రమే లోపలికి పంపనున్నారు. తక్కిన వారికి అనుమతినివ్వడం లేదు. కేంద్రం చుట్టూ ఐదు కిలోమీటర్లలోపున్న మద్యం విక్రయ కేంద్రాలను సైతం మూసివేయించారు. 144 సెక్షన్ సైతం అమలు చేస్తున్నారు.

ఫలితాలపై ఎవరి అంచనాలు వారివే...

మండలి ఎన్నికల ఫలితాలపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఈ ఎన్నికల్లో స్పష్టమవుతుందని విపక్షాలు చెబుతుండగా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు విజయపథాన నడిపిస్తాయని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. అంతే కాకుండా ఈ ఎన్నికల్లో ఓట్లు కొనేందుకు తాయిలాలు అధికంగా ఇచ్చిన వారిలో అధికార పార్టీ నేతలే ఉన్నారు. శాసనసభ్యులే స్వయంగా రంగంలోకి దిగి పోలింగ్ వారికి అనుకూలంగా జరిపించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డారు. ఇవి తమ మద్దతుదారుల విజయానికి దోహదం చేస్తుందని అధికారపార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ అంచనాలు ఎవరివి సరైనవన్నది మాత్రం మరి కొన్ని గంటల్లో తేలనుంది. ఈ ఫలితాలు రాబోయే సార్వత్రిక ఎన్నికల ఫలితాలపైనా ఎంతోకొంత ప్రభావం చూపే అవకాశం ఉండటమే ఈ ఎన్నికల ఫలితాలపై రాజకీయవర్గాల్లో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అధికారపార్టీకి అనుకూలమా వ్యతిరేకత ఉందా అన్నది ఈ ఫలితాలు కొంత వరకు స్పష్టం చేయనున్నాయన్న విశ్లేషణలు సాగుతున్నాయి.



జెఎన్‌టియులో కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం అనంతపురం నగరంలోని జెఎన్‌టియు కళాశాలలో కౌంటింగ్ కోసం చేపట్టిన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్ని ఓట్లు పోలయ్యాయో దాన్నిబట్టి ఎన్ని రౌండ్ల కౌంటింగ్ నిర్వహించాలనే దానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు మొదలైన 6 గంటల తర్వాత మొదటి ప్రాధాన్యత ప్రకారం ఎవరైనా గెలిచారా లేదా, కోటా ఎవరికైనా వచ్చిందా లేదా అనేది తెలుస్తుందని చెప్పారు. కోటా రాని పక్షంలో అక్కడి నుంచి ఎలిమినేషన్స్ మొదలవుతుందన్నారు. ఎలిమినేషన్ మొదలైన తర్వాత ప్రతి అభ్యర్థి ఓట్లను వేరే వాళ్లకు ప్రాధాన్యత ప్రకారం బదిలీ చేసుకుంటూ ఏ స్టేజీలో కోటా క్రాస్ అవుతుందో ఆ స్టేజ్లో ఫలితం వెల్లడి అవుతుందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి గురువారం రాత్రికి గానీ, శుక్రవారం ఉదయంలోపు ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందన్నారు.

పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ హాల్లో 24 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. మొదటి 16, 17 రౌండ్లు పోలింగ్ స్టేషన్ బాక్సులు తీసుకువచ్చి పేపర్స్ సరిచూసుకుని వాటిని కట్టలు కడతారన్నారు. ఈ ప్రక్రియ గురువారం సాయంత్రం వరకు జరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం కౌంటింగ్ మొదలు పెడతామని చెప్పారు. ఈ కౌంటింగ్ 10, 11 రౌండ్లు వచ్చే అవకాశం ఉందని, ఒక్కో రౌండ్ కౌంటింగ్ 2:30 గంటల నుంచి 3 గంటలు పట్టే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్ మొదలైన 24 గంటల తర్వాత 17వ తేదీ సాయంత్రం నాటికి మొదటి ప్రాధాన్యత ప్రకారం కోటా వచ్చిందా లేదా అనేది తేలే అవకాశం ఉందన్నారు. కోటా రాని పక్షంలో ఎలిమినేషన్స్ మొదలవుతాయని, ఎలిమినేషన్స్ మొదలయ్యేకొద్ది కోటాకి ఎంత గ్యాప్ ఉందో చూసుకుని పలు రౌండ్ల ఎలిమినేషన్‌లో ఫలితం వచ్చే అవకాశం ఉందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రంలోపు ఫలితం ఇచ్చే అవకాశం ఉందన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 2023-24 బడ్జెట్‌లోనైనా ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రత్యేకమైన కేటాయింపులు జరిగేనా లేక గడిచిన మూడేళ్ల లాగానే మొండి చెయ్యి చూపుతారా అని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం నాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో జిల్లాకు నిధులు విడుదల చేసి కనికరిస్తారా.? లేక గత బడ్జెట్‌ల్లాగానే ఉసూరుమనిపిస్తారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- ◆ బడ్జెట్ కేటాయింపులపై 'అనంత' ఆశ
- ◆ ఈసారైన అభివృద్ధి నిధులు ఉండేనా..?
- ◆ నేడు రాష్ట్ర బడ్జెట్

కనికరిస్తారా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిధులు లేక ఈ ప్రాంతంలో ప్రధాన ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. నిర్వహణకు సైతం నిధుల కేటాయింపుల్లేక అధ్వాన్నంగా మారాయి. జిల్లాకు ప్రధాన జలవనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది. ప్రవాహ సామర్థ్యం మేరకు నీటిని తీసుకోలేకపోతున్నారు. ఆధునీకరణ పనులను ఈ ప్రభుత్వం మధ్యలలోనే రద్దు చేసింది. మరో ఐదేళ్లు ఆధునీకరణ చేపట్టడానికి వీల్లేదన్న నిబంధనలు సైతం పెట్టింది. కనీసం గండ్లు పడకుండా పటిష్టం చేసేందుకు కూడా నిధులు కేటాయించలేదు. రూ.30 కోట్లు అయిన అవసరమని తుంగభద్ర అధికారులు ప్రభుత్వానిక నివేదించారు. కాని నిధులు మంజూరవలేదు. దీంతో 2002 సంవత్సరంలో తుంగభద్రకు నీరు పుష్కలంగా వచ్చిన సమయంలోనూ నీటిని పూర్తి స్థాయిలో తీసుకోలేని పరిస్థితి నెలకొంది. 30 టిఎంసిలోపే నీరు జిల్లాకు వచ్చింది. పిఎబిఆర్ పూర్తి సామర్థ్యం 11 టిఎంసిలు అయితే ఐదు టిఎంసిలకు మించి నీరు నిలువ చేయడం లేదు. ఎందుకంటే భూసేకరణ ఇప్పటికీ పూర్తి స్థాయిలో జరగలేదు. ఇవి చేయాలంటే సుమారు రూ.400 కోట్లు నిధులు అవసరమవుతాయి. దీనికీ నిధులు కేటాయించలేదు. సగం డ్యామ్ నింపడంతోనే సరిపెట్టుకోవవాల్సి వస్తోంది. ఇక హంద్రీనీవా ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించడమే కాకుండా టెండర్లు సైతం పిలిచారు. పనులు మాత్రం ఇప్పటి వరకు ప్రారంభమవలేదు. ఇక బిటిపి ప్రాజెక్టుకి ఎత్తిపోతల ద్వారా చేపడతామన్ని పనులు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పేరూరు ఎత్తిపోతల పథకాన్ని గత టెండర్లేనే ఆమోదిస్తూ అదనంగా మూడు రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పడమే కాకుండా శంకుస్థాపన సైతం చేశారు. మూడేళ్లలోపు పనులు పూర్తి చేస్తామని ఆనాడు ప్రకటించారు. కాని ఈ పనులకు సంబంధించి భూసేకరణ సైతం అడుగు ముందుకు పడలేదు. ప్రధాన ప్రాజెక్టులన్నీ ఈ రకంగా పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రం నిధులతో ముడిపడిన రహదారి, ఇతర పనులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేటాయించిన పనులేవి జరగడంలేదు. ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ రహదారి గుంతలమయంగా మారాయి. గ్రామీణ రహదారులు గుంతలమయంగా మారాయి. వ్యవసాయ యంత్రీకరణ, ఉద్యానవన పంటలకిచ్చే సబ్సిడీల్లోనూ కోతలు పెడుతున్నారు. దీంతో అనేక పథకాలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. గతంలో కాయగూరల పంటలకు సబ్సిడిపై విత్తనాలు, పాలి హౌస్ వంటి పథకాలకు కోతలు పెట్టేశారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. కొత్త ప్రాజెక్టులు కూడా జిల్లాకు ఈ మూడేళ్ల కాలంలో కేటాయించిన దాఖలాల్లేవు. పాత వాటికీ నిధుల కేటాయింపుల్లేవు. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే విధంగా తయారయింది. వచ్చే ఏడాది ఎన్నికలున్న నేపథ్యంలోనైనా వెనుకబడిన అనంతపురం జిల్లాకు నిధుల కేటాయింపులు పెంచుతారా.? లేక ఎప్పటిలాగానే మళ్లీ ఈ ప్రాంతానికి మొండి చెయ్యి చూపుతారా.? అన్నది నేటి బడ్జెట్‌లో చూడాల్సి ఉంది.

'దేశానికి మోదానీ ముప్పు'

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ◆ గణేనాయక్ భవన్‌లో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

దేశంలోని ప్రకృతి వనరులైన భూమి, నీరు, గాలి, అడవులు, గనులు ఇలా ప్రతిదీ అదానీ కంపెనీ వశం చేసుకుంటుందని, దీనికి ప్రధాని నరేంద్ర మోడీ సహకరిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో రూపొందించిన 'దేశానికి మోదానీ ముప్పు' పుస్తకాన్ని బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ 2014లో మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటికి అదానీ గ్రూపు సంస్థల మార్కెట్ విలువ రూ.56.100 కోట్లుగా ఉంటే 2022 నాటికి రూ. 16 లక్షల కోట్లకు ఎగబాకారని తెలిపారు. దీనికి మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అండదండలు తోడు కావడంతోనే సాధ్యమైందన్నారు. దేశంలోని 8 విమానాశ్రయాలు, 13 ఓడరేవులు, బొగ్గుగనులు, చమురు, సహజ వాయువు నిక్షేపాలు, గ్యాస్ పంపిణీ, విద్యుత్, విద్య, రియల్ ఎస్టేట్, వంట నూనెలు, అంతర్జాతీయ వ్యాపారం తదితర అనేక రంగాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని అదానీ సంస్థలు విస్తరించాయన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసి నుంచి పాలక ప్రభుత్వ ప్రోత్సాహకంతో అదానీ సంస్థ రూ.వేల కోట్ల రుణాలను పొందిందన్నారు. అదానీ వ్యాపార విస్తరణలోని మోసాన్ని, కపటత్వాన్ని, ప్రభుత్వ మద్దతును అమెరికాలోని హిండెన్‌బర్గ్ సంస్థ నివేదిక బట్టబయలు చేసిందన్నారు. వారు లేవనెత్తిన అంశాలకు అదానీ జవాబు చెప్పుకోలేక దేశభక్తి ముసుగులో దాక్కోవడానికి యత్నించారని విమర్శించారు. స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు 7 కంపెనీలు నమోదు కాగా, వాటికి అనుబంధంగా 578 సంస్థలను సృష్టించారని తెలిపారు. వీటి విలువ ఎక్కువ ఉన్నట్లు కృత్రిమ విలువ పెంచి భాగస్వాములను మోసం చేశారని తెలిపారు. అదానీ సోదరుడు వినోద్ అదానీ మారిషస్‌లో 38 డొల్ల కంపెనీలను అక్రమంగా నిర్వహించారని తెలిపారు. వీటితో పాటు వివిధ దేశాల్లో ఇలాంటి కంపెనీలను సృష్టించి దేశ సంపదను దోచుకుంటుంటే ఆదాయ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఏ మాత్రం స్పందించకపోవడం వెనుకద బిజెపి నేతల అభయం పుష్కలంగా ఉందన్నారు. మోదీ, అదానీల పరస్పర సహకారంతో చేసిన దోపిడీపై 'దేశానికి మోదానీ ముప్పు' పుస్తకంలో పొందుపరిచారన్నారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్, నీలోత్పల్‌బసు, ఎంవిఎస్.శర్మ, బి.తులసీదాస్‌లు రాసిన వ్యాసాలు పుస్తకంలో ఉన్నాయన్నారు. మేధావులు, ఉద్యోగులు, యువత ఈ పుస్తకాన్ని చదివి వాస్తవ విషయాలపై సమాజంలో చర్చించి ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జగన్, సూరి, ఉమాగౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేశానికి మోదానీ ముప్పు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పవన్‌ను ప్రజలు విశ్వసించరు : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : 30 ఏళ్లు అయినా రాష్ట్రంలో పవన్ కళ్యాణ్‌ను ప్రజలు విశ్వసించరని నగర మేయర్ మహమ్మద్ వసీం ఎద్దేవా చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్ బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ 10 ఏళ్లుగా రాజకీయాలు చేస్తున్నా ఏఒక్క రోజూ ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర లేదన్నారు. ముస్లిం మైనార్టీలు తనకు మద్దతు ఇవ్వాలని పవన్ కళ్యాణ్ కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమంత్రులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆరు నెలలకు ఒకసారి పవన్ కళ్యాణ్ బయటకు వచ్చి నన్ను నమ్మండి అంటే ప్రజలు నమ్మరన్నారు. సినిమాలు వేరు, రాజకీయాలు వేరు అన్న విషయాన్ని పవన్ కళ్యాణ్ గుర్తించాలన్నారు. 2024 ఎన్నికల్లో కూడా ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు అబుషాలేహ, సంపంగి రామాంజనేయులు, అనిల్ కుమార్ రెడ్డి, నాయకులు కుళ్లాయిస్వామి, ఖాజా పాల్గొన్నారు.

ఉరవకొండ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండల పరిధిలోని చిన్న ముష్టూరు గ్రామంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో యంగ్ షైన్ ఇండస్ట్రియల్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీతోపాటు తాడిపత్రి, కదిరి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు దాదాపు 35 మంది జాబ్ మేళాలో పాల్గొన్నారు. విద్యార్థుల వ్యక్తిగత నైపుణ్యాలను పరిగణలోకి తీసుకొని ఎన్నికైన వారి వివరాలు తెలుపుతామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది విద్యార్థుల ఆధ్వర్యంలో సీనియర్ మేనేజర్ సతీష్‌తో పాటు హెచ్ఆర్ మేనేజర్ వెంకట సతీష్ లకు పూలమాలలు వేసి శాలవాకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అష్రఫ్ అలీ, సిబ్బంది సురేష్ బాబు, అలీహఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభ దశలోనే కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రారంభ దశలోనే కుష్టు వ్యాధిని నిర్మూలిద్దామని డాక్టరు రామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాంపిల్ సర్వే అసెస్మెంట్ టీం గుంటూరు వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే చేసి అనుమానిత కేసులను గుర్తించి పిహెచ్‌సికి పంపాలన్నారు. ఈ సర్వేని 18వ తేదీన నిర్వహించాలన్నారు. ప్రారంభ దశలో ఉన్న కేసులను కనుగొని చికిత్స అందజేస్తే అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చని తెలియజేశారు. చర్మంపై రాగి రంగు మచ్చలున్నా, పాలిపోయిన స్పర్శ లేని మచ్చలు ఉన్నా కుష్టు వ్యాధిగా అనుమానించి వారిని పిహెచ్‌సికి పంపాలన్నారు. ఎండిటి చికిత్స ద్వారా కుష్టు వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. ఒకటి నుండి ఐదు మచ్చలు ఉన్నచో ఆరు నెలలు చికిత్స, ఆరు మచ్చలు పైబడి ఉంటే 12 నెలల చికిత్స ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ స్వాతిలక్ష్మి, డిపిఎంఒ సంజీవరెడ్డి, పిఎంఒ రవికుమార్, డిపిఎంఒ బాల ఓబులు, సిహెచ్ఒ మోహన్‌రావు, నోడల్ ఆఫీసర్ ఈశ్వరమ్మ, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఎస్ఈగా సతీష్‌చంద్ర

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరపాలక సంస్థ ఎస్ఈగా ఎస్.సతీష్ చంద్ర(ఎఫ్ఏసి)ను నియమిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అదేవిధంగా జి.చంద్రశేఖర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఫ్ఎసి)గా నియమిస్తూ ఈఎన్‌సి ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలి

తాడపత్రి రూరల్ : విద్యను వ్యాపారం చేసి యథేచ్ఛగా డబ్బులు దండుకుంటున్న తాడిపత్రి రూరల్ పరిధిలోని వైష్ణవి జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వరుణ్ ఎంఇఒకు బుధవారం వినతిపత్రం అందజేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రూ.10 వేలు ఆర్థికసాయం

శింగనమల : నాగుల గుడ్డం తండాలో నివాసముంటున్న మూడవత్ లక్ష్మక్క, మూడవత్ కమల నాయక్ కుమార్తె ఆదిలక్ష్మిబాయి వివాహానికి గాను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులు నరసింహ నాయక్, ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

17 నుంచి శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల సమ్మె


సమస్యల పరిష్కారం కోసం జైలుకైనా వెళ్తాం
తాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయించాలి
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బకాయి వేతనాలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు జమ చేయాలని ఇతర హక్కులు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 17వ తేది నుంచి శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు సమ్మె చేపడుతున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. బుధవారం జెవివి జిల్లా కార్యాలయంలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో కలిసి సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి ప్రాజెక్టుల కార్మిక సంఘాల అధ్యక్షులు తిప్పేస్వామి, నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ.. తాగునీటి పథకం కార్మికులు వేతనాలు పొందాలంటే రోడ్లు ఎక్కి ఆందోళనలు, నిరసనలు, సమ్మెలు చేసే దుస్థితిని ప్రభుత్వాలు కల్పించడం అన్యాయంగా ఉందన్నారు. చేసిన పనికి సకాలంలో వేతనాలు ఇచ్చి, ఇవ్వాల్సిన ఇఎస్ఐ, పిఎఫ్ఐ డబ్బులు జమ చేస్తే ఆందోళనలు, సమ్మెలు చేసే అవసరం ఉండదన్న విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు. సమ్మె చేసినప్పుడు, చేస్తామన్నప్పుడు మాత్రం 5 నెలల వేతనాల్లో 2 నెలలు వేతనాలు ఇవ్వడం ఉద్యమాన్ని శాంతింపజేస్తున్నారే తప్ప శాశ్వతం పరిష్కారం కార్మికులకు చూపకపోవడం దుర్మార్గం అన్నారు. వేతనాల చెల్లింపుల్లో కాంట్రాక్టర్, అధికారులు ఒకరిపై ఒకరూ చెబుతూ కార్మికులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఎల్అండ్‌టి కంపెనీ కార్మికులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, పిఎఫ్, వంటి డబ్బులు కార్మికులకు ఇంతవరకు జమ చేయడంలో జాప్యం చేయడం ఎందుకని ప్రశ్నించారు. ఇఎస్ఐ, పిఎఫ్, డబ్బులు కూడా జమచేయని దుస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఇస్తామన్న బోనస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి సౌకర్యాలు అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. వేతనాల కోసం, ఇవ్వాల్సిన హక్కుల కోసమే రోడ్డు ఎక్కే దుస్థితిని ప్రభుత్వం మార్చాలన్నారు. తాగునీటి సరఫరా పథకాలకు ఖచ్చితమైన బడ్జెట్ కేటాయింపులు చేసి పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. నీటి సరఫరా ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రయివేటీకరణ వంటి ఆలోచనలు ఉప సంహరించుకోవాలన్నారు. కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా శాసనసభ సమావేశాల్లో బడ్జెట్ కేటాయింపులు జరిగేలా జిల్లా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం ఆగదన్నారు. ఈ నెల 16వ తేది అర్ధరాత్రి నుంచే కార్మికులు పంపు మోటార్‌లు నిలిపి వేసి 17వ తేది నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సమస్య పరిష్కరించకుండా కార్మికులను పోలీసులతో అరెస్టులు చేయించి జైళ్లలోకి వేసినా తాము సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. ఈ సదస్సులో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు మహానంది, వన్నూరప్ప, తిరుపాల్ నాయక్, లక్ష్మిపతి, రాము, ప్రభాకర్, వన్నూరుస్వామి, ప్రకాష్, హనుమంతు, ఎర్రిస్వామి, సంజప్ప, మహంతి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చలు విఫలం
సమ్మె యథావిధిగా కొనసాగింపు

శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు, కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17వ తేది నుంచి సమ్మె చేపడుతున్న నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బుధవారం యూనియన్ నాయకులతో చర్చలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ ఛాంబర్ నందు నిర్వహించిన చర్చలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఇ జవహర్ కుమార్, శ్రీసత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ డిఇ రామారావు, అనంతపురం డిఇ గంగాధర్, శ్రీరామిరెడ్డి ప్రాజెక్ట్ డిఇ శ్రీనివాసులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం గతంలో సమ్మె చేపట్టిన సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 3-12, 2022వ తేదీన చేసిన అగ్రిమెంట్ ప్రకారం గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, బోనస్, సమ్మె కాలం 15 రోజుల వేతనాలు చెల్లింపు వంటివి 2023 జనవరి నెలలోగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు డబ్బులు చెల్లించాలని యూనియన్ నేతలు అధికారులకు తెలిపారు. శ్రీసత్యసాయి బోర్డ్ అధికారులు, సెక్రటరీ, ఎస్ఇ, యూనియన్ నేతల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం 2 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాల్సి ఉందన్నారు. ఇఎస్ఐ 14 నెలల బకాయిలు, పిఎఫ్ బకాయిలు వెంటనే ఇవ్వాలన్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులకు సంబంధించి ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ కాంట్రాక్టర్ శివారెడ్డితో అక్టోబర్ 22వ తేదిన జరిగిన ఒప్పందం ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ బకాయిలతో పాటు, 2 నెలల వేతనాలు చెల్లించాలని హామి ఇచ్చారని ఆ మేరకు చెల్లింపులు చేయాలని పట్టుపట్టారు. దీనిపై స్పందించిన అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, బిల్లులు రావాల్సి ఉన్నాయని, వచ్చిన వెంటనే కార్మికులకు చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది జనవరి నుంచి పిఎఫ్‌కు సంబంధించి కాంట్రాక్టర్ బిల్లులు పొందుపరుస్తుంటే పే అండ్ అకౌంటెంట్ కార్యాలయ అధికారులు అభ్యంతరం తెలపడాన్ని యూనియన్ నాయకులు అధికారులకు తెలిపారు. యూనియన్ నేతలు 17వ తేది నుంచి సమ్మె యథావితిగా కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

రమేష్ గౌడ్, రిలాక్స్ నాగరాజుకు సన్మానం



రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి బిసిసెల్ నాలుగు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ బిసి రమేష్ గౌడ్, సాంస్కృతిక విభాగం నాలుగు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ రిలాక్స్ నాగరాజులను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నూతనంగా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారితో జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ కోఆర్డినేటర్లుగా నియమితులైన రమేష్ గౌడ్, రిలాక్స్ నాగరాజులను శాలువతో సత్కరించారు. వారు మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంచించారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, మైనార్టీ సెల్ అధ్యక్షులు సైఫుల్లాబేగ్, ఎస్సీసెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, విద్యార్థి విభాగం అధ్యక్షులు సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్.వీరారెడ్డి కాలనీలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల మాట్లాడుతూ దేశంలో బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై హింస నిరోధక చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కవిత, నాయకులు బాలక్క, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

గుత్తి : సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు గుత్తిలో వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. బకాయిపడ్డ డిఎలను తక్షణమే చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు

నాయుడు గారి కుండ బిర్యాని ప్రారంభానికి సిద్ధం

బిర్యాని తినండి..
రూ.లక్ష బహుమతి గెలవండి

ప్రజాశక్తి -అనంతపురం

అనంతవాసులకు నోరూరించే వంటకాలతో నాయుడు గారి కుండ బిర్యాని మల్టీ కజిన్ రెస్టారెంట్ సిద్ధమయింది. స్థానిక తపోవనం సర్కిల్‌లో విరాజ్ బిల్డర్స్ ఆఫీస్ కింద శుక్రవారం గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. అధునాతన హంగులతో రూపుదిద్దుకుంటోంది. ఇండియన్, చైనీస్ తందూరి, బిర్యానీలు అందుబాటులో ఉంచనున్నారు. అనంతవాసులకు నాయుడు గారి కుండ బిర్యాని రెస్టారెంట్ వారు బంపర్ ఆఫర్ ఇస్తున్నారు. దాదాపు 30 రకాల ఐటమ్స్ అరగంటలో తింటే రూ.లక్ష బహుమతిగా బాహుబలి తలి ఆఫర్ ప్రకటించారు. .ఇంకా వందరకాల వంటకాలు రెస్టారెంటు నందు అందుబాటులో ఉంచారు. .ఆన్‌లైన్ డెలివరీ సౌకర్యం ఏర్పాటు చేశారు. స్విజ్జి, జొమాటో లలో బుక్ చెసుకోవచ్చని రెస్టారెంటు ప్రతినిధి బాషా పెర్కొన్నారు. ఇది వరకే హైదరాబాద్, బెంగళూరుతో పాటు విజయవాడ, వైజాగ్, గుంటూరు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, కడప, తెనాలి, ఏలూరు, రాజంపేట, కుప్పం, భీమవరం మచిలీపట్నం, మంగళగిరి, ప్రొద్దుటూరు, నరసిపట్నం, గుడివాడ, కాకినాడలో బ్రాంచులు ఏర్పాటయ్యాయి. శుక్రవారం అనంతపురం నందు ప్రారంభం కానుందని రెస్టారెంట్ నిర్వాహకులు వెల్లడించారు.



నాయుడు గారి కుండ బిర్యాని హోటల్

రాచానపల్లి ఎడిసిసి బ్యాంక్ సిఇఒపై చర్యలు తీసుకోవాలి

రూరల్ పోలీస్ స్టేషన్‌లో
బాధితుడి ఫిర్యాదు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతులకు రుణాలు ఇస్తామంటూ నమ్మించి డబ్బులు ఇవ్వకుండానే అప్పులు కట్టాలని వేధిస్తున్న రాచానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్ సిఇఒ శ్రీనివాసులు నాయుడుపై చర్యలు తీసుకోవాలని రాచానపల్లికి చెందిన మంగళ రాము డిమాండ్ చేశారు. బుధవారం పాత ఆర్డీవో కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన తండ్రి పిత్రార్జితంతో వారసత్వంగా వచ్చిన 2.67 ఎకరాల భూమి సజ్జల కాలవ గ్రామ పొలంలో సర్వే నెంబర్ 43లో ఉందన్నారు. తన తండ్రి సజ్జల కాలవ నివాసి లేట్ పెద్ద సుబ్బరాయుడు పేరుతో 8 ఎకరాల భూమి ఉండేదన్నారు. తన తండ్రి రాచానపల్లి పిసిసిఎస్ బ్యాంక్ నందు రూ.15 వేల రుణం తీసుకున్నాడని తెలిపారు. తండ్రి మృతి చెందడంతో ఆ అప్పును తనతో ఇద్దరు సోదరులు ముగ్గురు కలిపి ఆ అప్పును చెల్లించి సదరు భూమిని ముగ్గురు అన్నదమ్ములం భాగ పరిష్కారాలు చేసుకుని 2.67 ఎకరాల చొప్పున పంపకాలు చేసుకున్నామని తెలిపారు. తమ పేర్లతో ఉన్న భూమిపై రుణాలు ఇస్తామంటూ రాచానపల్లి పిఎసిఎస్ బ్యాంక్ సిఇఒ శ్రీనివాసులు హామీ ఇచ్చారన్నారు. ఆయన సూచన మేరకు అన్నదమ్ములం ముగ్గురు అదే బ్యాంకులో ఖాతాలు తెరిపించారన్నారు. మా భూములపై మార్టిగేజ్ చేసుకుని రుణం ఇస్తామంటూ నమ్మించి రూ.70 వేలు దాకా ఖర్చు చేయించాడన్నారు. తీరా డబ్బులు ఇవ్వాలని సదరు సిఇఒ శ్రీనివాసులును అడిగితే ఇతర బ్యాంకులో ఈ భూమిపై అప్పు ఉందంటూ బుకాయిస్తూ రుణం ఇవ్వకుండా మభ్య పెట్టాడని ఆరోపించారు. తీరా చూస్తే తమ భూములు రాచానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార లిమిటెడ్ బ్యాంక్ పేరుతో మార్టిగేజ్ అయి ఉన్నాయని తెలిపారు. రుణం ఇవ్వకుండా మా పేర్లతో రూ. 2 లక్షలు రుణం ఇచ్చినట్టు చూపిస్తూ మా భూములను బ్యాంకు ఆధీనంలోకి తీసుకున్నారని తెలిపారు. డబ్బులు ఇవ్వకుండానే రుణం ఇచ్చినట్లు ఎలా చేస్తారని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. తక్షణమే బ్యాంక్ ఉన్నతాధికారులు, పోలీసులు పరిశీలించి నిజా నిజాలను తేల్చి మాకు అన్యాయం చేసిన సిఇఒ శ్రీనివాసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకు చూపిస్తున్న రుణాలు మాకు ఇవ్వలేదని తేల్చి చెప్పారు. డబ్బులు ఇవ్వనప్పుడు మా భూమి పత్రాలు ఇవ్వమంటే ఇవ్వకుండా బ్యాంక్ మేనేజర్‌ని వెళ్లి కలవండి అంటూ బుకాయిస్తు మోసం చేయడానికి యత్నిస్తున్నాడని తెలిపారు. తక్షణమే ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకుని మునుముందు ఏ రైతూ మోసపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

17లోపు ఈక్రాప్ నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-ఉరవకొండ

రబీ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదుపై సందేహాలు ఉంటే ఈనెల 17వ తేదీ లోపు తెలపాలని ఉరవకొండ ఎడిఎ పద్మజ కోరారు. ఈ పంట నమోదు విధివిధానాలపై ఉరవకొండ మండల పరిధిలోని నింబగల్లు గ్రామం రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి శశికళ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ పద్మజ మాట్లాడుతూ 2022 రబీ సీజన్ ఈ పంట నమోదు వివరాలను మండల పరిధిలోని 17 సచివాలయాలలో జాబితాను సిద్ధం చేసి రైతు భరోసా కేంద్రాలలో సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఆ జాబితాలో ఎలాంటి సందేహాలు ఉన్నా ఈనెల 17వ తేదీ లోపు సంబంధిత వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారులు హేమ, అక్షిత, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రైతులు తమ పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ తెలిపారు. బుధవారం ఆత్మకూరు మండలం తలుపూరు రైతు భరోసా కేంద్రంలో రబీ ఈక్రాప్ బుకింగ్‌కు సంబంధించిన ముసాయిదా జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చంద్ర నాయక్ మాట్లాడుతూ..మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో ఈక్రాప్ నమోదు చేసిన రైతుల ముసాయిదా జాబితాను ప్రదర్శించామన్నారు. ఈనెల 17వ తేదీ వరకు జాబితాను ప్రదర్శిస్తామన్నారు. రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే రైతు భరోసా కేంద్రాల్లోని విఎఎ, విహెచ్ఎ, విఎస్ఎ, ఎంఎలను సంప్రదించి రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. సవరణ కోసం ఇది చివరి అవకాశమని చెప్పారు. తర్వాత మార్పులు, చేర్పులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ.వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి పి వెంకటేశ్వర్ ప్రసాద్, ఎఇఒ సుజిత, ఒడ్డుపల్లి సర్పంచి పి.లక్ష్మీనారాయణ రెడ్డి, తలుపూరు సర్పంచి ఓబులేసు, ఎంపిఇఒ భారతి, రైతులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం మూడు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. పోలీసులు విద్యార్థుల వద్ద చీటీలు ఉన్నాయో లేదో తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి వదిలారు. 859 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణలో, పోలీసుల బందోబస్తు, తనిఖీల మధ్య పరీక్షలు కొనసాగాయి.

నార్పల : నార్పల మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం సజావుగా జరిగాయి. పోలీసులు విద్యార్థుల హాల్ టికెట్లు తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి వదిలారు. సిసి కెమెరాల నిఘా మధ్య పరీక్షలు నిర్వహించారు. 211 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపల్ బాలయ్య తెలిపారు. తహశీల్దారు నారాయణస్వామి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని ఫాదర్ ఫెర్రర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం సజావుగా జరిగాయి. 170 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుత్తి : మత్తు పదార్థాలు సేవిస్తే అనారోగ్యం పాలవుతారని వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని పెద్దవడుగూరు ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసలై కొంతమంది లోన్ యాప్ ద్వారా అధిక వడ్డీకి రుణం తీసుకొని వాటిని తీర్చలేక తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. విద్యార్థులు బాధ్యతగా మెలగాలన్నారు. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ అరవింద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా

అనంతపురం సిటీ : ఓ హత్య కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా జడ్జి జి.శ్రీనివాసులు పదేళ్ల జైలు శిక్ష, చెరో రూ.5 వేలు జరిమానాను విధించారు. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం ఫిషరీష్ శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న కల్లూరు మహబూబ్ ఖాన్ 2018 నవంబర్ 1వ తేదీన హత్యకుగురయ్యాడు. ఈ కేసులో అనంతపురంకు చెందిన పటాన్ షేక్షావలి అలియాస్ బ్రూస్లీ, కంబగిరిరెడ్డి లు నిందితులు. మద్యం సేవించేందుకు డబ్బులు అడిగితే ఇవ్వలేదని తలపై రాళ్లతో కొట్టి హత్య చేశారు. మృతుడి కొడుకు కల్లూరు షహాన్వా ఖాన్ ఫిర్యాదు మేరకు అప్పటి అనంతపురం ఒకటవ పట్టణ సిఐగా ఉన్న ఎస్.విజయభాస్కర్ గౌడ్ సిఆర్ నెం. 378/2018 యు/ఎస్ 302 ఆర్/డబ్ల్యు 34 ఐపిసి కేసుగా నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి న్యాయ స్థానంలో హాజరుపరిచారు. అన్ని కోణాల్లో కేసు విచారించిన జిల్లా జడ్జి జి.శ్రీనివాసులు ఇద్దరికీ పది సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధించారు. ఈ కేసులో బాదితులు తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూషటర్ రాచమల్లు హరినాథ్‌రెడ్డి వాదనలు వినిపించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

గుత్తి : మండలంలోని ఊబిచెర్ల-కరిడికొండ గ్రామాల మధ్య 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రంగాపురం గ్రామానికి చెందిన మద్దక్క (60) కొంతకాలంగా తన కుమార్తె లలిత ఊరు అయిన కరిడికొండలో ఉంటోంది. మతిస్థిమితం లేని ఆమె జాతీయ రహదారిపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడి మరణించింది. మృతదేహం మీద వాహనాలు వెళ్లడంతో మాంసం ముద్దలా మారింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

టెంకాయల లోడు లారీ బోల్తా

ఒకరికి గాయాలు

యాడికి : టెంకాయల లోడు లారీ బోల్తాపడి ఒకరికి గాయాలు అయిన సంఘటన యాడికి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. తాడిపత్రి నుండి టెంకాయల లోడ్‌తో వచ్చిన ఓ ఐషర్ వాహనం కుంటలో ఉన్న షాపులో అన్‌లోడ్ చేయడానికై రోడ్డు దిగింది. లారీ అదుపుతప్పి డ్రెయినేజీ కాలువలోకి దిగడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో టెంకాయలు మీద పడడంతో స్థానిక బోయ వీధికి చెందిన వేరుశనగ కాయల వ్యాపారి నాగయ్య గాయాల పాలయ్యాడు. స్థానికులు అతన్ని ఓ వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

బాలిక మృతి

రాయదుర్గం : గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగి ఒళ్లు కాలిన బాలిక దీక్షిత (14) బుధవారం ఉదయం మరణించింది. రాయదుర్గం పట్టణంలోని కేకేటి రోడ్డు సమీపంలో నివసిస్తున్న శ్రీనివాసులు ఇంట్లో ఈనెల 3వ తేదీన గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. శ్రీనివాసులు కుమార్తె దీక్షిత ఒళ్లు కాలి తీవ్రంగా గాయపడింది. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన తండ్రి శ్రీనివాసులు కూడా ఈ సంఘటనలో స్వల్పంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన దీక్షితను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దీక్షిత బుధవారం మరణించింది. శ్రీనివాసులు కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది.

నీటితొట్టెలో పడి బాలుడు మృతి

రాయదుర్గం : నీటి తొట్టెలో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన రాయదుర్గం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాసులు కుమారుడు చందన్ కుమార్ (3) ఇంటివద్ద ఆడుకుంటూ నీరు నిలువ చేసిన తొట్టిలో పడిపోయాడు. అనంతరం గమనించిన కుటుంబ సభ్యులు బాలున్ని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దుగుమర్రిలో వాలంటీర్‌పై దాడి

నార్పల : నార్పల మండలం దుగుమర్రి గ్రామంలో శివారెడ్డి అనే గ్రామ వాలంటీర్ పై ఇద్దరు సోదరులు బుధవారం దాడిచేశారు. దీనిపై బాధిత వాలంటీరు, సచివాలయ సిబ్బంది నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దిగుమర్రి గ్రామానికి చెందిన శివారెడ్డి గ్రామ వాలంటీర్‌గా విధులు నిర్వహిసున్నాడు. గ్రామానికి చెందిన ఇద్దరు సోదరులు తమ భూమికి సంబంధించిన 1 బి అడంగల్ ఇవ్వాలని సచివాలయం వద్దకు వెళ్లి వాలంటీర్‌ను అడిగారు. స్పందించిన వాలంటీర్ అది తన పని కాదని, డిజిటల్ అసిస్టెంట్‌ను అడిగి తీసుకోవాలని తెలిపారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా ఆవేశానికి లోనైన ఇద్దరు సోదరులు వాలంటీర్ శివారెడ్డిపై దాడి చేశారు. ఇలా దాడులు చేస్తే తాము గ్రామాల్లో విధులు నిర్వహించలేమంటూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్ నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మామిడి చెట్లు దగ్ధం

గుత్తి : మండలంలోని ఊటకల్లు గ్రామంలో బుధవారం నిప్పు అంటుకుని మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి అనే రైతుకు చెందిన మామిడి తోట సమీపంలో ఉన్న గడ్డిపై ఆకతాయిలు నిప్పు వేశారు. దీంతో మంటలు ఎగిసిపడి మామిడి చెట్లు కాలిపోయాయి. ఘటనపై బాధిత రైతు తహశీల్దారు మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశాడు. రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఫీవర్ సర్వేపై నిర్లక్ష్యం తగదు

పుట్లూరు : ఫీవర్ సర్వేపై నిర్లక్ష్యం తగదని ఎంపీడీవో యోగానందరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని అరకటివేముల, సూర్య పల్లి, కడవకల్లు గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ తనిఖీ చేశారు. అనంతరం ఆయన సచివాల సిబ్బందితో మాట్లాడారు. ఫీవర్ సర్వే నత్త నడకన సాగుతోందని, వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

ఉపాధి పనులు కల్పించండి

పుట్లూరు : మండలంలోని ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో యోగానందరెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..మండలంలో ప్రతి రోజూ 2 వేల మంది ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పని ప్రదేశం నుండి రెండు ఫొటోలు తప్పనిసరిగా పంపాలన్నారు. ఏపీవో చెన్నకేశవులు, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

కంచె ఏర్పాటు చేయాలని వినతి

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని లక్ష్మీబజార్ యూనియన్ బ్యాంక్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న పెద్ద మురుగు కాలువకు ఇరువైపులా కంచె ఏర్పాటు చేయాలని పి అండ్ ఆర్ లా ఫార్మ్ ప్రతినిధులు జి.ప్రతాప్‌రెడ్డి, రాజేష్ శేషాద్రి మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతి చేశారు. ప్రధాన రహదారిపై మురుగు కాలువ వద్ద ఎలాంటి కంచె లేకపోవడంతో పిల్లలు, మనుషులు, పశువులు కాలువలో పడే ప్రమాదం ఉందన్నారు. రహదారిలో కాలువకు ఇరువైపులా కంచె ఏర్పాటు చేయాలని గత ఏడాది డిసెంబర్ నెలలో కలెక్టర్ నాగలక్ష్మికి కూడా వినతి చేశామని చెప్పారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినప్పటికీ ఇంతవరకు కంచె ఏర్పాటు చేయలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన కంచె ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వారు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

చిన్నారిని కాపాడిన పోలీసులు

అనంతపురం సిటీ : రోడ్డు పక్కన వదిలేసిన మూడు నెలల చిన్నారిని పోలీసులు సురక్షితం చేశారు. బుధవారం డయల్-100 విభాగానికి ఓ వ్యక్తి ఫోన్ చేసి మన్నీల క్రాస్ వద్ద రోడ్డు పక్కన 3 నెలల మగ శిశువును వదిలేసి వెళ్లారని సమాచారం పంపారు. వెంటనే డయల్-100 విభాగం సిబ్బంది ఇటుకలపల్లి పోలీసులకు సమాచారం చేరవేశారు. ఎస్ఐ శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్ పోలీసులు హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్లి చిన్నారిని జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్య చికిత్స అందించి సురక్షితం చేశారు. అనంతరం ఐసిడిఎస్ విభాగానికి సమాచారం పంపారు.